సాక్షి
అనకాపల్లి
సోమవారం । 15 । జూలై । 2024



విశేషంగా ఆర్జిత సేవలు 8లో

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం నిత్య కల్యాణం జరిపారు.



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది(విశాఖ) : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.5/25.0

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్లపడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

పెద్దేరులో పెరుగుతున్న నీటి మట్టం



జల కళతో పెద్దేరు జలాశయం

మాడుగుల రూరల్: ఆడపా దడపా కురుస్తున్న వర్షాలకు పెద్దేరు జలాశయంలో నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. ఆదివారం నాటికి జలాశయంలో నీటి మట్టం 136.20 మీటర్లకు చేరింది. జలాశయ పూర్తిస్థాయి నీటి మట్టం 137 మీటర్లు. జలాశయ పరిసరాల్లో ఆదివారం అందిన సమాచారం మేరకు 6 మి.మీ. వర్షపాతం నమోదయింది. తాజా వర్షాలకు 31 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతోందని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

వైభవంగా మోదమ్మ పాదాలు పండగ



108 ఘటాలతో ఆలయానికి వెళుతున్న భక్తులు

మాడుగుల: మండలంలోని ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలసిన మోదకొండమ్మ పాదాలు పండగ ఆదివారం వైభవంగా జరిగింది. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీ. 108 ఘటాలను శిరస్సున పెట్టుకుని భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. వర్తక సంఘం, ఉత్సవ కమిటీ, ఆటో యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పండగ సందర్భంగా జరిపిన ప్రత్యేక కుంకుమ పూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక శాసన సభ్యుడు బండారు సత్యనారాయణ మూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు కోట్ని సత్తింబాబు, పుట్టాబలరామ్, పి.కొండలరావు, పి.నానాజీ, కె.లింగరాజు, వై.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి దిబ్బల్లో షూటింగ్ సందడి



ఎర్రమట్టి దిబ్బల్లో షూటింగ్ చేస్తున్న దృశ్యం

కొమ్మాది(విశాఖ) : భీమిలి బీచ్ రోడ్డులోని ప్రముఖ పర్యాటక ప్రాంతం ఎర్రమట్టి దిబ్బల్లో షూటింగ్ సందడి నెలకొంది. మెగా హీరో వరుణ్ తేజ్ నటిస్తున్న చిత్రానికి సంబంధించిన కొన్ని సన్నివేశాలు, ఫైటింగ్‌లను ఇక్కడ చిత్రీకరించారు. 15 రోజులపాటు విశాఖ – భీమిలి బీచ్ రోడ్డు ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ చిత్రీకరణ ఉంటుందని యూనిట్ సభ్యులు తెలిపారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు



ప్రిజమ్ కాలేజీలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

మహారాణిపేట(విశాఖ): జిల్లాలో యూపీఎస్సీ ఆధ్వర్యంలో మెడికల్ సర్వీసెస్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, 2 నుంచి 4 గంటల వరకు రెండు సెషన్స్‌లో జరిగిన ఈ పరీక్షకు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1,222 మందికి గాను 730 మంది హాజరయ్యారు. 492 మంది గైర్హాజరయ్యారు. రెండు సెషన్స్‌కు 59 శాతం మంది హాజరైనట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహనరావు తెలిపారు.

కాలేజీల లెక్క తేలాల్సిందే.!

- జూనియర్ కాలేజీలపై ఫోకస్
- 'యు–డైస్ ప్లస్'లో నమోదైతేనే గుర్తింపు
- విద్యార్థుల సమగ్ర వివరాల సేకరణ
- కాలేజీల్లో కుస్తీలు పడుతున్న యాజమాన్యాలు
- ఈ కారణంగానే ఫస్టియర్ అడ్మిషన్లలో తీవ్ర జాప్యం



విశాఖలోని ఎన్ఏడీ వద్ద గల ఎస్ఆర్ జూనియర్ కాలేజీ

విశాఖ విద్య:

జాతీయ విద్యా విధానం పటిష్టంగా అమలు చేయాలనే కేంద్ర ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా జూనియర్ కాలేజీల నిర్వహణపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే విద్యార్థుల సమగ్ర వివరాలను తొలిసారిగా 'యు–డైస్ ప్లస్' పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. యు–డైస్ ప్లస్‌లో నమోదైన వివరాలనే ప్రామాణికంగా తీసుకుని భవిష్యత్‌లో కాలేజీలకు గుర్తింపు(రెన్యువల్ రికగ్నైజేషన్) ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఇందులో నమోదైన విద్యార్థులనే ఈ ఏడాది వార్షిక పరీక్షలకు అనుమతించనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. దీంతో విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని ఇంటర్ విద్యాశాఖాధికారులు అప్రమత్తమయ్యారు. కళాశాలల నిర్వాహకులతో ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 382 జూనియర్ కాలేజీలు ఇంటర్మీడియట్ బోర్డు వద్ద నమోదయ్యాయి. వీటిలో 21 కాలేజీలు నిర్వహణలో లేవు. మిగిలిన 361లో 13 కళాశాలల్లో మొదటి సంవత్సరం అడ్మిషన్లు జరగలేదు. ఆరు కాలేజీల్లో మొదటి, రెండో సంవత్సరం అడ్మిషన్లు కూడా లేవు. 2023–24 విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 58,944 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఇందులో ఒక్క విశాఖ జిల్లాలోని కాలేజీల్లోనే 40,871 మంది చేరారు.

కాలేజీలకు కేటాయించిన యు–డైస్ కోడ్‌తో ప్రస్తుతం విద్యార్థులు, కాలేజీలకు సంబంధించిన సమగ్ర వివరాలు నమోదు చేస్తున్నందున.. ఉమ్మడి విశాఖ జిల్లాలోని జూనియర్ కాలేజీల వాస్తవ లెక్క తేలనుంది.

ఫస్టియర్ అడ్మిషన్లలో తీవ్ర జాప్యం

2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమై ఇప్పటికే 42 రోజులు గడిచిపోయింది. కానీ ఇంటర్మీడియట్ ఫస్టియర్ అడ్మిషన్లు సవ్యంగా ముందుకు సాగడం లేదు. యు–డైస్ ప్లస్ పోర్టల్‌లో సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థుల వివరాలన్నీ నమోదు చేస్తేనే, ఫస్టియర్ అడ్మిషన్లు నమోదుకు వెబ్‌సైట్‌లో అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ కొన్ని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల వారికి చిక్కులు తెచ్చిపెట్టింది. ఒకే గుర్తింపుతో వేర్వేరు చోట్ల కాలేజీలు నిర్వహిస్తున్న వారికి ఈ పరిణామాలతో చెక్ పడినట్లయింది. పరిమితికి మించి విద్యార్థులను చేర్చుకుని.. పరీక్షల సమయంలో ఏదో ఒక చోట నామినల్ రోల్ సృష్టించడం కూడా ఇక సాధ్యం కాదు. దీంతో కాలేజీల్లోని వాస్తవికతను యు–డైస్ ప్లస్‌లో నమోదు చేయక తప్పడం లేదు.

ప్రైవేటు కాలేజీల్లో తనిఖీలు నిల్

విద్యా సంవత్సరం ప్రారంభ సమయంలో ఏటా జూనియర్ కాలేజీలను ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు తనిఖీలు చేస్తుంటారు. ఇంటర్మీడియట్ కోర్సు ప్రాధాన్యం దృష్ట్యా జూనియర్ కాలేజీల్లో నిబంధనలు మేరకు అన్నీ సవ్యంగా ఉన్నాయా.? లేదా.? అనేది పరిశీలన చేస్తారు. కాలేజీ నిర్వహణకు అనువైన భవనాలు, ఫైర్ సేఫ్టీ, ఆట స్థలం, సైన్స్ ల్యాబ్, అర్హత కలిగిన అధ్యాపకులు ఎంత మంది ఉన్నారనే వాస్తవికతను ధ్రువీకరిస్తారు. కానీ ఈ ఏడాది ఇవేమీ లేకుండానే కాలేజీల నిర్వహణకు కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వ పెద్దలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే ప్రచారం ఉంది. దీంతో మళ్లీ ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలకు రెక్కలొచ్చినట్లేనని విద్యారంగ నిపుణులు అంటున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



కాలేజీలకు సంబంధించిన సమగ్ర వివరాలను యు–డైస్ ప్లస్‌లో వెంటనే నమోదు చేయాలి. దీనిపై కాలేజీల ప్రిన్సిపాళ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రైవేట్ కాలేజీలపై నిరంతరం తనిఖీలు ఉంటాయి. ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలు పాటించని కాలేజీలపై చర్యలు తీసుకుంటాం.

– మురళీధర్, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

చెడు వ్యసనాలకు చెక్

ఫ్యాషన్‌గా మొదలు పెడుతున్న చెడు వ్యసనాలతో యువత జీవితాలను బలి చేసుకుంటున్నారు. ఆ మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు. మాదక ద్రవ్యాలు, ఆల్కహాల్‌కు బానిసలైన వారి కుటుంబాలు ఛిన్నాభిన్నం అయిపోతున్నాయి. ప్రధానంగా పేద, మధ్య తరగతి వర్గాల్లో ఈ దురలవాట్లు వారి జీవన విధానంపై దుష్ప్రభావం చూపిస్తున్నాయి. ఒకవైపు ఆరోగ్యం పాడైపోవడమే కాకుండా ఆర్థిక ఇబ్బందులు, నేరమయ జీవితాలకు అలవాటు పడుతున్నారు. ఈ అనర్థాలకు చెక్ పెట్టేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత మందులు
- సత్ఫలితమిస్తున్న మత్తు వ్యసన విముక్తి విభాగం సేవలు



గవరపాలెం చిన్న హైస్కూల్లో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

అనకాపల్లి : మాదక ద్రవ్యాలైన చుట్ట, బీడీ, సిగరెట్, గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాల నుంచి దూరం అవ్వాలనుకునే వారి కోసం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో మత్తు వ్యసన విముక్తి విభాగాన్ని నాలుగు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం వీరికి మంచి మందులు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఖరీదైన మందులే అయినప్పటికీ ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని విధంగా మందులు అందజేస్తున్నారు. విభాగం ఏర్పాటు చేసినప్పటి నుంచి నేటి వరకూ వ్యసన బాధితులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. 2021లోనే ఈ మందులు అందుబాటులోకి వచ్చినప్పటికీ వీటి వలన ఎటువంటి ఇబ్బందులు వస్తాయోనని కొందరు, ధైర్యం చేయలేక మరికొందరు వాడేందుకు విముఖత చూపించారు. కానీ గత ప్రభుత్వ హయాంలో పలు అవగాహన కార్యక్రమాలతో పాటు వివిధ కారణాలతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరే వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా మందుల వాడకానికి బాధితులు ముందుకు వస్తున్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో.. : నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రామ్ ద్వారా మాదక ద్రవ్యాల అలవాట్ల నియంత్రణకు ఈ మందులు సద్వినియోగపడుతున్నాయి. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారికి వారి ఆరోగ్య స్థితిని బేరీజు వేసుకుని వైద్యులు వివిధ పరిమితుల్లో మందులు అందిస్తున్నారు. వీటిని రెండు రకాలుగా అందుబాటులోకి తీసుకు వచ్చారు. నికోటిన్ ప్యాచ్ (స్టిక్కర్ రూపంలో) 7 ఎంజీ, 14 ఎంజీ, 21 ఎంజీ రూపంలో చేతి భుజానికి స్టిక్కర్ అతికించే విధానంలో అందిస్తున్నారు. నికోటిన్ గమ్స్ రూపంలో పంటి కింద పెట్టుకునేలా 2 ఎంజీ, 4 ఎంజీ మోతాదులో అందిస్తున్నారు. ఆల్కహాల్ బాధితులకు కూడా వారు ఆల్కహాల్ సేవించే పరిమితి, వారి ఆరోగ్య స్థితిని బట్టి మందుల రూపంలో నెల నుంచి 3 నెలల కోర్సుగా మందులు వాడిస్తున్నారు. మాదక ద్రవ్యాలు, ఆల్కహాల్ మానేసేందుకు సిద్ధపడిన వారికి ఆస్పత్రుల్లో వైద్యులు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తుండగా, అందుబాటులో ఉన్న నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రామ్ ప్రతినిధులు అవుట్ పేషెంట్లను కలిసి కౌన్సెలింగ్‌తో పాటు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సేవా సంస్థలతో సమావేశాలు నిర్వహించి మాదక ద్రవ్యాల నియంత్రణకు అవగాహన కల్పిస్తున్నారు.

సత్ఫలితమిస్తున్న అవగాహన కార్యక్రమాలు..

పట్టణ, మండల పరిధిలో మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి. మత్తు కొంత మంది విద్యార్థులకు వ్యసనంగా మారుతోంది. మాదక ద్రవ్యాలు, ఆల్కహాల్ బారిన పడిన వారి ఆరోగ్య స్థితి క్రమేపీ క్షీణించే పరిస్థితి ఏర్పడుతుంది. తల్లిదండ్రులు విద్యార్థుల నడవడికపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– క్రాంతికుమార్, మత్తు వ్యసన విముక్తి విభాగం కౌన్సెలర్, అనకాపల్లి ఆస్పత్రి

మాట మార్చిన కూటమి ప్రభుత్వం



విలేకరులతో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు ధర్మారావు, దుర్గాప్రసాద్

- జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల అన్యాయం

బుచ్చెయ్యపేట: ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగేలా జీపీఎస్‌ను అమల్లోకి తీసుకురావడానికి ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయడం హేయమైన చర్య అని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎల్.ఎన్.ధర్మారావు, ఎస్.దుర్గా ప్రసాద్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం బుచ్చెయ్యపేటలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఓ మాట ఎన్నికల తరవాత మరో మాటలా ప్రస్తుత ప్రభుత్వ విధానం కనిపిస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే పోరాటాలు చేయగా జీపీఎస్ జీవోను విడుదల చేయకుండా నిలిపివేశారన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన ప్రభుత్వం పాత తేదీలతో జీపీఎస్‌ను అమలు చేస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదల చేయడం తగదన్నారు. ఉపాధ్యాయులకు అన్యాయం చేసేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని, ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా చర్యలు చేపడితే ఏ స్థాయి ఉద్యమానికైన ఉపాధ్యాయులంతా సిద్ధమవుతారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను మోసగించకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

గెజిట్ నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలి

నర్సీపట్నం: జీపీఎస్ అమలుపై జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వరహాలనాయుడు, జి.వి.రమేష్ డిమాండ్ చేశారు. జీపీఎస్‌ను అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధపడడం సరికాదని వారు తెలిపారు. జీపీఎస్ వల్ల ఉద్యోగులకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 2023 అక్టోబర్ 20 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చినట్టు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని పీఆర్‌టీయూ నాయకులు తీవ్రంగా ఖండించారు.

సాగరతీరంలో ఐఎన్ఎస్ విరాట్!



విక్టరీ ఎట్ సీ వద్ద సిద్ధమవుతున్న ఐఎన్ఎస్ విరాట్ నమూనా

బీచ్‌రోడ్డు: భారత నౌకాదళ చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిన ఐఎన్ఎస్ విరాట్ యుద్ధనౌక విశాఖ సాగరతీరంలో దర్శనమివ్వనుంది. అయితే ఇది నిజమైన నౌక కాదు. దాని నమూనా. ఐఎన్ఎస్ విరాట్‌ను సాగరతీరంలో మ్యూజియంగా తీర్చిదిద్దాలని భావించినప్పటికీ.. కొన్ని కారణాల వల్ల సాధ్యపడలేదు. ఆ లోటును పూడ్చేందుకు విరాట్ నమూనాను విక్టరీ ఎట్ సీ వద్ద సిద్ధం చేస్తున్నారు. దీనిని సందర్శకులు దూరం నుంచి స్పష్టంగా చూసేందుకు.. చుట్టూ పెద్ద అద్దాలను అమర్చారు. ఈ అద్భుతమైన నమూనాను తయారు చేయడానికి కళాకారులు శ్రమిస్తున్నారు. ఐఎన్ఎస్ విరాట్ భారత నౌకాదళానికి ఎంతో కాలం సేవ చేసింది. విరాట్ వైభవవంతమైన చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు నేవీ వర్గాలు తెలిపాయి.

కన్నీటి 'తాండవ'ం

తాండవ రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో వరి నారు.. నాట్లు స్థాయికి పెరిగింది. కొన్నాళ్లుగా కాస్తున్న ఎండలకు ఆకు మడులు ఎండిపోకుండా నీటి తడులు పెడుతూ కాపాడుకుంటూ వస్తున్నారు. వర్షాకాలం మొదలై నెలన్నర రోజులవుతున్నా రిజర్వాయర్లో నీటి మట్టం ఆశించినంతగా పెరగలేదు. దీంతో ఖరీఫ్ సాగుపై ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.



తాండవ ఆయకట్టు పరిధిలో రైతులు వేసిన వరినారు

- నారు పెరుగుతోంది.. నీటి మట్టం పెరగట్లేదు
- తాండవప్రాజెక్టు నీటి మట్టంపై రైతుల్లో ఆందోళన
- మల్లగుల్లాలు పడుతున్న జలాశయం అధికారులు

నాతవరం: జిల్లాలో మేజరు ప్రాజెక్టుగా తాండవ రిజర్వాయర్‌కు ప్రత్యేక ఉంది. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న రైవాడ, కల్యాణపులోవ, పెద్దేరు, కోనాం ప్రాజక్టుల్లో నీటి మట్టం పుష్కలంగా ఉంది. ఆయా ప్రాంతాల ఆయకట్టుదారులు ఖరీఫ్ వరి సాగుకు ఆకు మడులు వేసి, సన్నద్ధంగా ఉన్నారు. కొన్ని చోట్ల వరి నాట్లు కూడా మొదలయ్యాయి. తాండవ రైతులు మాత్రం వరుణుడి కరుణ కోసం ఆశగా నిరీక్షిస్తున్నారు.

నెల రోజులకే సరిపోతుంది!

తాండవ నీటిపై అధారపడి నర్సీపట్నం, పాయకరావుపేట, తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలో 52 వేల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేస్తుంటారు. ఈ ఏడాది తాండవ రిజర్వాయరు నీటి మట్టం దారుణంగా పడిపోయింది. గతంతో పోల్చుకుంటే ఇటీవల వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. ఆయకట్టు క్యాచ్‌మెంట్ ఏరియాలో కూడా ఇదే పరిస్థితి. దీంతో ఇన్‌ఫ్లో లేక నీటి మట్టం పడిపోయింది. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 380 అడుగులు. డెడ్ స్టోరేజీ 345 అడుగులు. ప్రస్తుతం ప్రాజెక్టులో 364 అడుగుల నీటి మట్టం ఉంది. ఈ నీటిని ఆయకట్టుకు రెండు కాల్వల ద్వారా విడుదల చేస్తే కేవలం 30 రోజులు మాత్రమే వస్తుందని అధికారులు చెప్తున్నారు. ఖరీఫ్‌లో రైతులు వేసే వరి పంట చేతికి రావాలంటే 120 రోజలపాటు ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలి.



తాండవ రిజర్వాయర్

భారమంతా వరుణుడిపైనే

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ సాగుకు వీలుగా రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల ద్వారా 1978 క్వింటాళ్ల వరి విత్తనాలు సకాలంలో రైతులకు అందించారు. దీంతో అడపా దడపా కురిసిన వర్షాలకు రైతులు వరి నారుపోశారు. అప్పుడప్పుడు కురుస్తున్న వానలు నారు మడులు ఎండిపోకుండా కాపాడుతున్నాయి. ఇప్పటికే నారు నాట్లకు వీలుగా పెరిగింది. నెలాఖరులోగా వర్షాలు పుష్కలంగా కురిసి తాండవ నీటి మట్టం పెరిగి, ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తే పర్లేదు. లేకుంటే నారు ముదిరి పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు దిగాలుపడుతున్నారు. అధికారులు చెప్తున్న లెక్కల మేరకు వరి నారు వేసిన 21 రోజుల్లో నాట్లు వేసుకోవాలి. నెల రోజులు వ్యవధిలో వేసినా ఆశించిన దిగుబడులు వస్తాయి. నారు ముదిరాక నాట్లు వేస్తే పెట్టుబడి పెరిగి, దిగుబడులు పడిపోతాయని అధికారులు చెప్తున్నారు.

నీటి మట్టం 370 అడుగులు దాటాలి

తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం ఆశించినంత స్థాయికి పెరగలేదు. ఈ నీటి మట్టంపై ఆధారపడి రైతులు ముందుకెళ్లడం కాస్త ఇబ్బందే. నీటి మట్టం 370 అడుగులు దాటాలి. ఆ స్థాయికి చేరితే ఆగస్టు 15 తర్వాత ఆయకట్టు రైతులు ఖరీఫ్ సాగుకు నీటిని విడుదల చేసే అకాశం ఉంది.

– శ్యామ్‌కుమార్, జేఈ, తాండవ ప్రాజెక్టు నాతవరం సెక్షన్

చేతబడి అనుమానంతో వృద్ధుడి హత్య



సంఘటన స్థలంలో మృతదేహం

- పొలం గట్టు వివాదం కారణంగా చంపేశాడంటున్న మృతుని బంధువులు
- పోలీసు స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు
- కేజే పురంలో సంచలనం రేపిన ఘటన



సూర్యనారాయణ (ఫైల్)

మాడుగుల రూరల్: తన కుటుంబ సభ్యులకు చేతబడి చేశాడన్న అనుమానంతో ఒక వృద్ధుడిని కిరాతకంగా కత్తితో నరికి హత్యచేసిన సంఘటన కేజే పురంలో సంచలనం రేపింది. అయితే పొలంగట్టు విషయంలో జరిగిన గొడవ కారణంగానే హత్య జరిగిందని మృతుడి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కేజే పురం గ్రామానికి చెందిన సూరిశెట్టి సూర్యనారాయణ(68), అదే గ్రామానికి చెందిన సూరిశెట్టి నర్సింగరావు బంధువులు. వీరి కల్లంపాకలు కె.జె.పురం పరిధిలోని తాచేరు నది సమీపంలో పక్కపక్కనే ఉన్నాయి. పొలం గట్టు సరిహద్దు గురించి శనివారం ఇద్దరి మధ్య వివాదం జరిగింది. ఆదివారం సాయంత్రం కూడా వీరి మధ్య మళ్లీ గొడవ రేగింది. ఈ సమయంలో పాకలో ఉన్న కత్తితో సూర్యనారాయణ మెడ మీద సూరిశెట్టి నర్సింగరావు దారుణంగా నరికాడు. దీంతో సూర్యనారాయణ అక్కడికక్కడే రక్తపు మడుగులో పడి మృతి చెందాడు. నేరం అంగీకరిస్తూ ఆదివారం రాత్రి మాడుగుల పోలీసు స్టేషన్‌కు వెళ్లి నిందితుడు లొంగిపోయాడు. తన కుటుంబ సభ్యులకు చేతబడి చేశాడని, అందువల్లే సూర్యనారాయణను హత్యచేశానని నిందితుడు నర్సింగరావు చెప్పినట్టు పోలీసులు తెలిపారు. సూర్యనారాయణ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ పి.దామోదర్‌నాయుడు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు సూర్యనారాయణకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎంతో సౌమ్యుడిగా పేరు పొందిన సూర్యనారాయణ హత్యకు గురికావడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మృతదేహం వద్ద బంధువులు గుండెలవిసేలా రోదించారు.

నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి



నూకాంబిక అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధికసంఖ్యలో భక్తులు పిల్లపాపలతో వచ్చి బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ పరిధిలో కొంతమంది భక్తులు తమ గృహాల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నర్సీపట్నం: మున్సిపాలిటీలో 23వ వార్డుకు చెందిన ఎస్.ఎర్రినాయుడు అనే వ్యక్తి అకారణంగా తనపై దాడి చేసి గాయపరిచాడని అదే వార్డుకు చెందిన గుడపు కొండ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. టీటీడీ కల్యాణ మండపం దగ్గరలో గల తన లారీ సప్లయి ఆఫీసుకు ఎర్రినాయుడు తరచూ వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నాండంటూ బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్ఐ తెలిపారు. ఎర్రినాయుడు మద్యం మత్తులో తనపై దాడి చేసి గాయపరచడమే కాకుండా చంపేస్తానని బెదిరించాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అతని వయస్సు సుమారు 50 ఏళ్ల ఉండవచ్చని, ఎత్తు సుమారు 5.5 అడుగులు, చామనచాయ రంగులో ఉన్నట్లు జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. అతడు నీలం రంగు పొడుగు చేతుల చొక్కా, నీలం రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గల గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా 96661 22722, 94406 27547 నెంబర్లలో గానీ తెలియజేయాలని కోరారు.

వర్షాలకు కుప్పకూలిన తాటాకిల్లు

అడ్డతీగల: ఎడతెరిపిలేని వర్షాలకు మండలంలోని వేటమామిడిలో గిరిజనుడు వేంపాటి రమేష్‌కు చెందిన తాటాకిల్లు ఆదివారం ఒక్కసారిగా కుప్పకూలింది. దాంతో భయభ్రాంతులైన రమేష్, అతని భార్య, ఇద్దరు పిల్లలు హుటాహుటిన కూలిన ఇంట్లో నుంచి బతుకు జీవుడా అని బయటపడ్డారు. బాధితులను బీజేపీ జిల్లా కార్యదర్శి ఈరోజు స్వప్నకుమారి, టీడీపీ కార్యకర్తలు పరామర్శించారు. రెవెన్యూ అధికారులు కూలిన ఇంటిని పరిశీలించి నష్టం అంచనా వేస్తున్నారు. నిరాశ్రయులయ్యామని ప్రభుత్వం తమను ఆదుకుని పక్కా ఇంటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని బాధితుడు రమేష్ కోరాడు.

బంకుల్లో బురిడీ

కొలతల్లో మాయ.. పాయింట్లలో మోసాలు



- మీటర్ ట్యాంపరింగ్‌కు పాల్పడుతున్న శివారు ప్రాంత పెట్రోల్ బంకులు
- తనిఖీలను నిలిపేసిన పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ అధికారులు
- గత ప్రభుత్వ హయాంలో ప్రతి వారం ఆకస్మిక తనిఖీలకు ఆదేశాలు
- ప్రత్యేక యాప్ ద్వారా తనిఖీల వివరాల నమోదు
- ఇప్పుడు చోద్యం చూస్తున్న అధికారులు

మధురవాడ ఐటీ సెజ్‌కు వెళ్లేందుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రసాద్ మద్దిలపాలెం పెట్రోల్ బంకులో రూ.100 పెట్రోల్ కొట్టించి హడావుడిగా వెళ్లిపోయాడు. హనుమంతువాక జంక్షన్‌కు వెళ్లే సరికి పెట్రోల్ లేకపోవడంతో బైక్ ఆగిపోయింది. రాత్రి తిరిగి బంకు వద్దకు వచ్చి అడిగితే.. ఆ షిఫ్ట్‌లో ఉండేవారిని అడగండి అంటూ బంక్ సిబ్బంది కసురుకోవడంతో మౌనంగా వెళ్లిపోయాడు.

పెందుర్తికి చెందిన శంకర్ శ్రీకాకుళం ఫ్యామిలీతో వెళ్తూ ఆనందపురం దగ్గరలోని పెట్రోల్ బంకులో తన కారులో రూ.2000 క్యాష్ ఇచ్చి డీజిల్ కొట్టించగా.. 50 కి.మీ దూరం వెళ్లే సరికి రిజర్వ్‌లోకి వచ్చేసింది. తర్వాత రోజు పెట్రోల్ బంక్‌కు వెళ్లి జరిగిన మోసం గురించి అడిగితే.. తమ బంక్‌లో ఆయిల్ కొట్టించారనడానికి ఆధారాలేవి అంటూ దబాయించారు. సీసీ పుటేజ్ చూడండి అని ప్రశ్నిస్తే.. అవి పనిచేయడం లేదు.. ఏం చేసుకుంటారో చేసుకోండి అని చెప్పడంతో.. ఏమీ చేయలేక నిస్సహాయంగా వెనుదిరిగాడు.



సాక్షి, విశాఖపట్నం: జిల్లాలో పెట్రోల్ బంకుల్లో చమురు మోసాలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో ఉన్న బంకుల్లో ఉదయం 10 గంటలలోపు రాత్రి 9 గంటల తర్వాత ఈ తరహా మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నగర పరిధిలోనూ కొన్ని బంకుల్లో మోసాలకు పాల్పడుతూ వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్నారు. జిల్లాలో తనిఖీలు మాత్రం శూన్యమనే చెప్పొచ్చు.

బంకుల్లో ఏం చేస్తున్నారు.?

పెట్రోల్ బంకుల్లో మోసాలపై అప్రమత్తంగా లేకపోతే వినియోగదారులు నష్టపోయే అవకాశం ఉంది. కొన్ని బంకులు అత్యాధునిక సాంకేతికత వినియోగించి మోసాలకు పాల్పడుతున్నట్లు వెలుగులోకి వస్తున్నాయి. మీటరు పూర్తి మొత్తాన్ని చూపిస్తున్నా 3 నుంచి 5 శాతం కంటే తక్కువ ఆయిల్ రాకుండా నిలిపేస్తున్నారు. ఉదాహరణకు మీటర్ రీడింగ్‌లో అంతా బాగానే ఉన్నట్లు అనిపించినా రూ.1000 విలువైన పెట్రోల్ కొట్టమంటే.. వాహనంలో రూ.950 నుంచి 970 విలువైన ఆయిల్ మాత్రమే అందిస్తున్నారు. మీటర్లలో సెట్టింగ్ చేయడం వల్లే ఈ తరహా మోసాలు ఎక్కువవుతున్నాయి. ఇటీవలే రామ్‌నగర్‌లోని పెట్రోల్ బంకులో వినియోగదారుడిపై సిబ్బంది దాడికి పాల్పడిన ఘటన కూడా దీనికి సంబంధించిందే.

కల్తీ కూడా జరుగుతోందా..?

కొన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధనం నింపుతుంటే పెట్రోల్, డీజిల్‌తో పాటు కొంత మేర నీరు కూడా వస్తోందని వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నీరు కలవడం వల్ల బైక్‌లు, కార్లు ఇంజిన్లు మొరాయిస్తున్నాయంటూ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బంకుల్లోని ట్యాంకర్ల అడుగు భాగంలో సబ్‌మెర్సిబుల్ మోటారు పంప్ ఉంటుంది. ఇందులోకి కొన్ని సందర్భాల్లో నీరు చేరిపోతుంటుంది. ఆయిల్ ద్వారా ఆ నీరు వాహనాల ఆయిల్ ట్యాంకుల్లోకి వచ్చేస్తోంది. పెట్రోల్ బంకులు నిర్వహణ సరిగా లేనందువల్లే ఈ తరహా సమస్యలు తలెత్తుతున్నాయి.

తనిఖీలెక్కడ సారూ..?

పెట్రోల్ బంకులను తరచూ తూనికలు కొలతల శాఖ, పౌర సరఫరాల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలి. లీటర్ పెట్రోల్‌లో ఏమైనా కోత వేస్తున్నారా.? పూర్తిస్థాయిలో పాయింట్లు వస్తున్నాయా లేదా.? ఎక్కడైనా పాయింట్స్ జంప్ అవుతున్నాయా.? పెట్రోల్ నాసిరకంగా వస్తుందా.? వినియోగదారులకు సరైన సౌకర్యాలు అందుతున్నాయా లేదా.? అనే అంశాల్ని ఆకస్మికంగా తనిఖీ చేసి లోపాలు కనిపిస్తే చర్యలు తీసుకోవాలి. కానీ.. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. నాణ్యత విషయంలో ఫిర్యాదులు వస్తుంటే.. కొందరు పౌర సరఫరాల శాఖ సిబ్బంది తూతూ మంత్రంగా తనిఖీలకు వెళ్లడం.. బంకు యజమానుల నుంచి తమకు రావల్సిన సొమ్ములు దండుకొని వదిలేయడం నిత్యకృత్యంగా మారిపోయింది. కొందరు తూనికలు కొలతల శాఖ, పౌర సరఫరాల శాఖ అధికారులు, సిబ్బందికి పెట్రోల్ బంకుల నుంచి నెలవారీ మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ఎలాంటి ఫిర్యాదులొచ్చినా చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకట్రెండు సార్లు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆకస్మిక తనిఖీలు చేస్తామని ముందస్తుగానే బంకులకు సమాచారం ఇస్తుండటంతో వారంతా అప్రమత్తమవుతున్నారు. దీంతో మోసాలేవీ బయటపడటం లేదన్నది జగమెరిగిన సత్యం.

ఇన్‌స్పెక్షన్ యాప్ కథ కంచికి..!

బంకుల్లో నాణ్యతతో పాటు సౌకర్యాలు లేకపోయినా బంకులపై చర్యలు తీసుకునేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. ప్రత్యేకంగా రూపొందించిన ఇన్‌స్పెక్షన్ యాప్ ద్వారా నిరంతర తనిఖీలు నిర్వహించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లా పరిధిలో ఉన్న 88 పెట్రోల్ బంకుల్లో గత నాలుగేళ్ల కాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించి.. కేసులు నమోదు చేయడంతో బంకు యజమానులు అప్రమత్తంగా ఉండేవారు. కానీ.. ఆరు నెలలుగా రెండు విభాగాలు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో మోసాలు మళ్లీ షురూ చేశారు. గత ప్రభుత్వం రూపొందించిన ఇన్‌స్పెక్షన్ యాప్‌ను కూడా వినియోగించకుండా వదిలేశారు. జిల్లాలోని సర్కిల్-1,2,3 తో పాటు రూరల్ పరిధిలో ఎక్కడా తనిఖీల జాడ కనిపించడం లేదు. దీంతో వినియోగదారుల జేబులకు బంకుల యజమానులు చిల్లులు పెడుతూ.. వచ్చిన లాభాలను పౌర సరఫరాల శాఖ సిబ్బందితో పంచుకుంటున్నారనే విమర్శలొస్తున్నాయి. ప్రతిరోజూ రూ.లక్షల్లో ఇంధన మోసాలు జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తుండటంపై వినియోగదారులు మండిపడుతున్నారు.



ఎక్కడా కనిపించని ఈ తరహా తనిఖీలు

ప్రణాళికలు పక్కాగా అమలు చేశాం..

- ఏపీఎల్ విజేతగా నిలిచాం..
- వారియర్స్ ఆటగాడు అశ్విన్ హెబ్బర్



విశాఖ స్పోర్ట్స్ : ఏపీఎల్ 3వ సీజన్‌లో పక్కాగా ప్రణాళికలు అమలుచేస్తూ.. కచ్చితంగా 500 పరుగులు సాధించాలన్నా కోచ్ నిర్దేశం అతడిలో కసిని పెంచింది. ఎనిమిది మ్యాచ్‌ల్లో 91.20తో యావరేజ్‌తో ఏకంగా సీజన్‌లోనే అత్యధిక పరుగులు(456) నమోదు చేశాడు. అతడే పదేళ్లుగా రంజీల్లో ప్రతిభ కనబరుస్తూ చాంపియన్స్ ఎలెవెన్‌కు ఆడి... ప్రస్తుత ఏపీఎల్ సీజన్‌లో సత్తా చాటిన వైజాగ్ వారియర్స్ ఆటగాడు, వైస్ కెప్టెన్ అశ్విన్ హెబ్బర్. విశాఖ వేదికగా ముగిసిన ఏపీఎల్ మూడో సీజన్‌లో మొత్తంగా ఎనిమిది మ్యాచ్ లాడిన అశ్విన్ నాలుగుసార్లు సెంచరీ మార్కుకు చేరువయ్యాడు. ఏపీఎల్ తొలి రెండు సీజన్లలో వారియర్స్ పెద్దగా రాణించకపోయినా ఈ సీజన్‌లో ఏకంగా టైటిల్‌నే ఎగరేసుకుపోవడంలో కీలకపాత్ర పోషించాడు. విజయానందాన్ని ‘సాక్షి’తో పంచుకున్నాడు. అతని మాటల్లోనే..

ఈ సీజన్ సంతృప్తినిచ్చింది..

ఏపీఎల్ గత రెండు సీజన్లకు భిన్నమైన స్ట్రాటజీతో ముందుకు వచ్చాం. నా వరకు అయితే మెంటర్, కోచ్ ఇచ్చిన ప్రతి సలహాను అమలుపరిచాను. డైట్‌ను సైతం మార్చాను. ఆటగాళ్లతో వైస్ కెప్టెన్‌గా నాలుగు అంశాల్లో స్థిరమైన అంచనాతో చర్చించాను. అదే మాకు పెద్దగా హెల్ప్ అయింది. గత పదేళ్లుగా చక్కటి ప్రతిభ కనబరుస్తున్నా.. ఈ ఏపీఎల్ సీజన్‌లో మంచి గుర్తింపు వచ్చింది. మొత్తం ఎనిమిది మ్యాచ్‌ల్లో 456 పరుగులు చేయడం సంతృప్తినిచ్చింది. గత రెండు సీజన్‌ల్లోనూ రాణించాను.

లీగ్ దశలో ఓడిన జట్టుతోనే టైటిల్ పోరు

లీగ్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో డిఫెండింగ్ చాంపియన్ రాయలసీమ కింగ్స్‌ను ఓడించాం. అయితే ఉత్తరాంధ్ర లయన్స్ చేతిలో ఓటమి పాలయ్యాం. లీగ్‌లో మేము ఓడిన మ్యాచ్ అది ఒక్కటే. అక్కడే మా విజయానికే కాకుండా టైటిల్ గెలవడానికి ప్రణాళిక రచించాం. తు.చ తప్పకుండా అమలు చేశాం. ఫైనల్‌లో లయన్స్‌ను ఓడించి చాంపియన్‌గా నిలిచాం. వీడియోలను పరిశీలించాం..

లీగ్ దశలో కేవలం లయన్స్‌తో మ్యాచ్‌లో మాత్రమే ఓటమి చెందాం. ఫైనల్‌కు ముందు ప్రత్యర్థి బలం ఎక్కడ, జట్టు బలహీనతలు ఏమిటి అనేది చర్చించాం. ఎలాంటి షాట్స్ ఏ ఆటగాడు ఆడుతున్నాడు... వారి వీడియోలను నిశితంగా పరిశీలించాం. లెఫ్ట్, రైట్ కాంబినేషన్లతో ఒక ఫార్ములా తయారుచేసుకుని గ్రౌండ్‌లోనే గాక గ్రౌండ్ బయట ప్రాక్టీస్ చేశాం. అది ఎలాంటి ఫలితాన్ని ఇచ్చిందంటే ఏకంగా టైటిల్ సొంతం చేసుకునేంత. చర్చించిన విషయాల్ని అమలు పరిచాం. టైటిల్ వేటలో ప్రత్యర్థిని 102 పరుగులకే నిలువరించాం.

సమష్టి కృషితో విజేతలుగా నిలిచాం



మాట్లాడుతున్న వారియర్స్ సీఈవో శ్రీనుబాబు

విశాఖ స్పోర్ట్స్ : ఏపీఎల్ మూడో సీజన్ విజేత వైజాగ్ వారియర్స్ జట్టు సంబరాలు ఉత్సాహంగా సాగాయి. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జట్టు వైస్ కెప్టెన్ అశ్విన్ హెబ్బర్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా ఆడి విజేతలుగా నిలిచామన్నారు. గత రెండు సీజన్లలో ఆశించిన స్థాయిలో ఆడలేకపోయామని, ఈసారి తొలి మ్యాచ్ నుంచే పట్టుదలగా ఆడామన్నారు. వారియర్స్ సీఈవో శ్రీనుబాబు మాట్లాడుతూ జట్టు ఫ్రాంచైజీలు ఆటగాళ్ల వేలంలోనూ పాల్గొంటారన్నారు. ఈసారి కెప్టెన్, వైస్ కెప్టెన్‌లతో సహా జట్టు మేనేజ్‌మెంట్‌కే ఏ బౌలర్ ఎప్పుడు, ఏ ఆటగాడి స్థానం ఎక్కడ అనే విషయాల్లో పూర్తి స్వేచ్ఛనిచ్చామన్నారు. అందుకు తగ్గట్టుగానే ఆటగాళ్లు సమష్టిగా కృషి చేసి.. విజేతలుగా నిలిచారని సంతోషం వ్యక్తం చేశారు. కెప్టెన్ భరత్ అలసటతో ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయారు. జట్టు ఆటగాళ్లు పాల్గొని వారి అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో జట్టు సహా ఫ్రాంచైజీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్నస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఆలస్యంగా బయల్దేరిన కిరండూల్ పాసింజర్

తాటిచెట్లపాలెం: ఆదివారం ఉదయం 6.45గంటలకు విశాఖపట్నంలో బయల్దేరాల్సిన విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ మూడు గంటలు ఆలస్యంగా ఉదయం 9.45గంటలకు విశాఖపట్నంలో బయల్దేరింది.

చిట్టీల పేరుతో రూ.3కోట్లకు కుచ్చుటోపీ

ఆరిలోవ: చిట్టీల పేరుతో ఓ మహిళ తోటి మహిళలకు టోకరా వేసింది. సుమారు రూ.3 కోట్లకు కుచ్చుటోపీ పెట్టేసింది. దీంతో బాధితులు ఆమె ఇంటిని ముట్టడించారు. డబ్బులు ఇవ్వాలని అడిగిన బాధితులకు నేను నివాసం ఉంటున్న ఇల్లు మాత్రమే ఉంది. అది అమ్ముకుని పంచుకోండి అంటూ ఆమె తెగేసి చెబుతోంది. బాధితులు తెలిపిన వివరాలివీ. జీవీఎంసీ 13వ వార్డు పరిధి లక్ష్మీనగర్‌లో అయితి వెంకటలక్ష్మి కొన్నేళ్లుగా చిట్టీలు నిర్వహిస్తోంది. ఆమె వద్ద సుమారు 120 మంది వరకు స్థానిక మహిళలు రూ.ఒక లక్ష, రూ.2 లక్షలు, రూ.3 లక్షలు, రూ.5 లక్షలు చిట్టీలు కడుతున్నారు. ఇలా మొత్తం రూ.3 కోట్ల వరకు కట్టారు. అవసరాల కోసం చిట్టీలు పాడుకునేవారు. కొన్నాళ్లుగా ఆమె చిట్టీలు పాడిన వారికి డబ్బులు ఇవ్వకుండా రేపు, ఎల్లుండి అంటూ తిప్పుతోంది. చివరికి తన వద్ద డబ్బులు లేవని తేల్చి చెప్పేసింది. దీంతో లబోదిబోమంటూ బాధితులు ఆమెను నిలదీశారు. మూడు నెలల కిందట బాధితులంతా ఆరిలోవ పోలీసులను కలిసి విషయం తెలియజేశారు. పోలీసుల సమక్షంలో రెండు నెలల్లో బాధితులకు డబ్బులు ఇచ్చేస్తానని వెంకటలక్ష్మి చెప్పింది. కానీ గడువు దాటినా డబ్బులు ఇవ్వలేదు. మళ్లీ అడిగితే తన ఇంటిని విక్రయించి డబ్బులు తీసుకోవాలని చెప్పింది. 60 చదరపు గజాల్లో మూడు అంతస్తులు ఉన్న ఆ ఇల్లు అక్కడ ధరలను బట్టి సుమారు రూ.60 లక్షల విలువ చేస్తుంది. దీంతో ఆ డబ్బులు కొందరి అప్పు మాత్రమే తీర్చడానికి సరిపోతాయి. దీంతో పాటు ఆ ఇంటి మీద రూ.25 లక్షలు బ్యాంక్ లోన్ కూడా ఉన్నట్లు బాధితులు అంటున్నారు. వెంకటలక్ష్మి కొద్ది రోజుల కిందట తన కుమారులను ఇంటి నుంచి వేరే ఊరు పంపించేసి ఒంటరిగా ఉంటోంది. దీంతో ఆదివారం బాధితులంతా వెంకటలక్ష్మి ఇంటిని ముట్టడించారు. డబ్బులు ఇవ్వాలని ఆమెను ఒత్తిడిచేశారు. నా వద్ద డబ్బులు లేవు. మీరే ఇంటిని అమ్ముకుని డబ్బులు తీసుకోండి అంటూ పాత పాటే పాడింది. సుమారు రూ.60లక్షలు విలువ చేసే ఆ ఇంటిని రూ.90 లక్షలకు విక్రయించాలని కూడా మరో మెలిక పెడుతోందని బాధితులు వాపోయారు. తమ డబ్బులతో వేరే చోట్ల ఇల్లు, స్థలాలు కొనుగోలు చేసిందని బాధితులు అంటున్నారు. వెంకటలక్ష్మి ఇంటిని బాధితులు ముట్టడించిన విషయం తెలుసుకున్న ఆరిలోవ ఎస్ఐ నరసింహమూర్తి, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి తగిన న్యాయం జరుగుతుందని వారికి నచ్చజెప్పారు. దీంతో బాధితులు స్టేషన్‌కు చేరుకుని వెంకటలక్ష్మిపై ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సరదాలు.. సెల్ఫీలు

బీచ్‌రోడ్డు: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాలు, బీచ్‌లు సందడిగా కనిపించాయి. ప్రకృతిని ఆస్వాదించేందుకు వచ్చిన ప్రజలు సముద్రంలో స్నానాలు చేసి.. సెల్ఫీలు తీసుకుంటూ సరదాగా గడిపారు. చిన్నారులు ఇసుకలో బొమ్మలు వేసి, ఇసుక కోటలు కట్టి ఆనందించారు. యువత తమ స్నేహితులతో కలిసి సముద్రపు అలల్లో ఆడుకుంటూ సమయాన్ని గడిపారు. మహిళలు కబుర్లతో కాలక్షేపం చేశారు. వృద్ధులు తమ మనవళ్లతో కలిసి ఎంజాయ్ చేశారు. సందర్శకుల రద్దీ కారణంగా బీచ్‌గార్డ్‌లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ.. ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేశారు. సందర్శకుల రాకతో చిరు వ్యాపారుల వ్యాపారం జోరుగా సాగింది











క్లుప్తంగా

జీతాల కోసం కొనసాగుతున్న దీక్షలు



దీక్ష చేస్తున్న మత్తు వ్యసన విముక్తి విభాగం కాంట్రాక్ట్ ఉద్యోగులు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసిన మత్తు వ్యసన విముక్తి విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు బకాయి జీతాలు చెల్లించాలని ఆస్పత్రి వద్ద మూడో రోజు ఆదివారం దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా ఉద్యోగి ఎస్.క్రాంతికుమార్ మాట్లాడుతూ 12 నెలలుగా జీతాలు లేక మత్తు వ్యసన విముక్తి విభాగంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ప్రభుత్వాలు కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలపై ఎందుకు కక్షసాధింపు చర్యలు చేపడుతుందో అర్థం కావడం లేదన్నారు. చాలీచాలని జీతాలతో కాంట్రాక్టు పద్ధతిలో కుటుంబాన్ని పోషించుకునేందుకు ఉద్యోగాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వాలు తమపై సీతకన్ను వేసిందని ఆయన పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు బి.నాయుడుబాబు, జి.కీర్తన, జి.రాజ్యలక్ష్మి, ఎల్.శ్రీదేవి, చంద్రశేఖర్, ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయ పరిసరాల్లో శ్రమదానం

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం మోదకొండమ్మ ఆలయ ప్రాంగణం నలువైపులా పెరిగిన తుప్పలు, డొంకల్ని స్థానిక యువత, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తొలగించారు. వచ్చే నెల 4న అమ్మవారి పండగ సందర్భంగా ఆలయ పరిసరాలతో పాటు ముందు భాగాన్ని శుభ్రం చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక యువకులు శ్రమదానంలో పాల్గొన్నారు.

ఘనంగా లలితాంబిక అమ్మవారి పండగ



రాంబిల్లి (అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని దిమిలి గ్రామంలో లలితాంబిక అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయానికి తెల్లవారు జాము నుంచే భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పండగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
భారతీయుడు 2	:షిర్డిసాయి
భారతీయుడు 2	:పర్తిసాయి
మనమే	:వెంకటేశ్వర
14	:శ్రీసత్య
సారంగదరియా	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-20 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 297 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 225 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ముమ్మరంగా వరి నారుమళ్లు

ఖరీఫ్ సీజన్ కావడంతో దుక్కి దున్నుతున్న రైతులు



నారుమళ్లు వేసేందుకు ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

కశింకోట: మండలంలోని రైతాంగం ఆదివారం ముమ్మరంగా వరి నారుమళ్లు వేశారు. ఖరీఫ్ సీజన్‌లో వరి ఎక్కువగా పండిస్తారు. సుమారు వెయ్యి హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేస్తారు. నారు పోయడానికి ప్రస్తుతం సీజన్ కావడంతో ఎక్కువగా విత్తనాలు వేశారు. దీనికి ముందు ఎక్కువ మంది రైతులు సంప్రదాయం పాటిస్తుంటారు. సాధారణంగా ఆదివారం, మంగళవారం, గురువారం, శుక్రవారం రోజుల్లో నారు పోయడం, నాట్లు వేయడం శుభ సూచకంగా భావిస్తారు. ఇలా అయితే పంట బాగా పండుతుందని రైతుల విశ్వాసం. గత కొద్ది రోజులుగా అడపా దడపా వర్షాలు కురవడంతో నారుమళ్లు వేస్తున్నారు. మండలంలోని కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, నరసింగబిల్లి, పరవాడపాలెం, నూతలగుంటపాలెం, చింతలపాలెం, గొబ్బూరు, అచ్చెర్ల, కన్నూరుపాలెం, జి.భీమవరం, చెరకాం, అడ్డాం, తీడ తదితర గ్రామాల్లో ఎక్కువగా వరి పండిస్తారు. వీటిలో ఆర్జీఎల్ వరి సాగే సింహ భాగం. దీని సాగు పట్ల రైతులు ఎక్కువగా మక్కువ చూపుతారు. ఇది ఎక్కువ దిగుబడి ఇస్తుందని, తెగుళ్లను తట్టుకుని, నీటి ముంపులో నిలబడుతుందని, ధాన్యం అన్నంగా తినేందుకు బాగుంటుందని, పశువులకు వరి గడ్డి దాణాగా ఎక్కువగా లభిస్తుందని భావించి రైతులు దీన్ని ఎక్కువ సాగు చేస్తున్నారు. దీని తర్వాత సోనా మసూరి, సాంబ మసూరి విత్తనాలు వేయడానికి భూమి అనుకూలతను అనుసరించి ప్రాధాన్యం ఇస్తారు. సుమారు 650 క్వింటాళ్ల విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసింది. కొందరు రైతులు గత ఏడాది ధాన్యాన్ని నిల్వ ఉంచుకున్నారు. వీటిని తమ మడుల్లోకి తీసుకెళ్లి పూజలు చేసి నారు పోశారు. సాధారణంగా ఈ నెలాఖరు వరకు నారుమళ్ల ప్రక్రియ కొనసాగుతుంది. ఎడ్ల నాగళ్ల సహాయంతో గతంలో విత్తనాలు పోసేవారు. ఇప్పుడు ఎడ్లను మేపడం ఆర్థిక భారంగా పరిణమించి వీటిని సాకడం పట్ల రైతుల్లో ఆసక్తి సన్నగిల్లింది. ఎడ్ల నాగళ్ల సహాయంతో దుక్కి దున్నితే భూమి గుల్లబారి నారు ఏపుగా వస్తుంది. అయితే ఇప్పుడు ఎడ్ల నాగళ్లు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రత్యామ్నాయంగా ట్రాక్టర్ల సహాయంతోనే ఎక్కువగా విత్తనాలు జల్లుతున్నారు. మండలంలో ఎక్కువగా వరి పంట వర్షాధారంగా పండిస్తారు. కొందరు మాత్రం వ్యవసాయ బోర్లను వినియోగిస్తారు. వర్షాలు పడి నారు ఎదిగిన నెల రోజుల నుంచి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నాట్లు వేస్తారు. దాదాపు సెప్టెంబర్ మొదటి వారం వరకు నాట్లు వేస్తారు. వరి రకాన్ని అనుసరించి కొన్ని ముందుగా, మరికొన్ని ఆలస్యంగా పండుతాయి. నవంబర్, డిసెంబర్ నెలల్లో వాతావరణం అనుకూలిస్తే పంట చేతికి వస్తుంది.

పర్యావరణ పరిరక్షణే శ్రీరామరక్ష



నెహ్రూ చౌక్ నుంచి బైక్ ర్యాలీగా బయలుదేరిన గ్రీన్ క్లబ్ సభ్యులు



ఆరుద్ర పురుగులపై అవగాహన కల్పిస్తున్న గ్రీన్ క్లబ్ ప్రతినిధులు

అనకాపల్లి: భావితరాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ, వృక్ష మిత్ర అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ అన్నారు. గ్రీన్ క్లబ్, అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని ఆధ్వర్యంలో బట్లపూడి పంచాయతీ నాయుడుపేట సోహం ఆశ్రమంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందు పట్టణంలోని నెహ్రూచౌక్ నుంచి బట్లపూడి గ్రామానికి క్లబ్ సభ్యులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుద్ర పురుగులు కనిపిస్తే వర్షాలకు సూచన అని, వీటిని రైతు మిత్రులుగా భావిస్తారన్నారు. వీటి మనుగడ రసాయన ఎరువుల వల్ల ప్రమాదంలో పడిందన్నారు. జీవజాతులు నశిస్తే వాటిని తిరిగి పొందలేమని పేర్కొన్నారు. విశ్రాంత అటవీ రేంజర్ బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి సురక్షితంగా జీవిస్తుందన్నారు. అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని వ్యవస్థాపకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి మాట్లాడుతూ భావితరాల భద్రతకు పాటు పడదాం అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, బేతాళం శేషసాయి, పి.ఉమామహేశ్వరరావు, వై. అప్పారావు, శ్రీనివాసరావు, సోహం ఆశ్రమం వ్యవస్థాపకులు కాండ్రేగుల రవి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా గంటి రవికుమార్



అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

అనకాపల్లి: అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా గంటి రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జార్జీ క్లబ్ ఆవరణలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. సంఘ ఉపాధ్యక్షుడిగా పేరూరీ భోగలింగం, ప్రధాన కార్యదర్శిగా పి.వి. మల్లికార్జునరావు, కార్యదర్శులుగా మల్లేశ్వరరావు, ప్రశాంత్, సహాయ కార్యదర్శులుగా ఫణి సుబ్రహ్మణ్యం, దొరబాబు, సురేష్, కోశాధికారిగా కామేష్, సహాయ కోశాధికారిగా సోమశేఖర్, తమ్మి రాజు, శ్యాంకుమార్, గౌరవాధ్యక్షులుగా కన్నేపల్లి గౌరీపతి శర్మ, రేజేటి రామాచార్యులు, కె.విశ్వనాథం, కార్యవర్గ సభ్యులుగా కుమార్, విశ్వనాథం, చావలి రమేష్, బమ్మిడిపాటి కిరణ్, పూజ్యం నాగబాబు, కొడుకుల శ్రీకాంత్, కామేశ్వరరావు, బుల్లిసు, భాస్కరరావు, శేఖర్, శ్రీనివాసరావు, నాని, భాస్కరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గంటి రవికుమార్ మాట్లాడుతూ కొత్త కమిటీ రెండేళ్ల పాటు కొనసాగుతుందని తెలిపారు. గౌరీపతిశర్మ మాట్లాడుతూ సమాజంలో బ్రాహ్మణులకు సరైన గుర్తింపు లేదన్నారు. అటు రాజకీయపరంగా.. ఇటు సమాజపరంగా సరైన ఆదరణ లేదని బ్రాహ్మణులంతా ఐకమత్యంగా ఉంటూ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనకాపల్లి బ్రాహ్మణ సంఘానికి ఒక కమ్యూనిటీ బిల్డింగ్ అవసరముందని, బ్రాహ్మణులకు కర్మకాండ, పిండ ప్రదానాలకు శారదా నది ఒడ్డున ప్రత్యేక సదుపాయలతో కూడిన భవనాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.

ఆస్పత్రిలో రోగులకు భోజన సదుపాయం



ఆస్పత్రిలో ఇన్ పేషెంట్లకు భోజన సదుపాయాన్ని ప్రారంభిస్తున్న వెంకటేష్

నక్కపల్లి: స్థానిక 50 పడకల ఏరియా ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా ఉన్న రోగులకు భోజన సదుపాయాన్ని ఆదివారం నుంచి ప్రారంభించారు. కొద్ది నెలలుగా ఇక్కడ కొనసాగుతున్న భోజన సదుపాయం నిలిచిపోయింది. బిల్లు చెల్లింపుల్లో జాప్యం కారణంగా కాంట్రాక్టర్ భోజన సదుపాయాన్ని నిలిపివేసాడు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చొరవతో తిరిగి ఈ భోజన సదుపాయాన్ని ఆదివారం నుంచి పునః ప్రారంభించినట్లు ఆస్పత్రి కమిటీ మాజీ చైర్మన్ మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. రోగులకు మధ్యాహ్నం ఆయన భోజనాన్ని అందజేశారు.

'రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి'

బుచ్చెయ్యపేట: అక్టోబర్ 2న వడ్డాదిలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర రక్తదాన ప్రచారకర్త, వందే భారత్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వినోద్‌బాబు యువతకు పిలుపునిచ్చారు. ఆదివారం వడ్డాదిలో జిమ్ వద్ద అమ్మ హెల్పింగ్ హార్ట్స్ యువత, సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా గాంధీ జయంతి రోజున అమ్మ హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది ఏర్పాటు చేసిన శిబిరం ద్వారా 567 యూనిట్ల రక్తం సేకరించినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి సప్తాహ కార్యక్రమాలు

గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు



మునగపాకలోని సాయిబాబా ఆలయం

మునగపాక: మండల కేంద్రంలో సాయిబాబా ఆలయంలో ఈ నెల 15 నుంచి సప్తాహ కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు బొడ్డేడ వీరేంద్ర తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి అఖండ జ్యోతి వెలిగించి ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి భజన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా నిర్వహించే భజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అలాగే 21 వ తేదీన ఉదయం 5 గంటలకు హారతి, మేలుకొలుపు , 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మహానైవేద్యం జరుగుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు. భక్తులు వారం రోజుల పాటు జరిగే దైవ కార్యక్రమాలను జయప్రదం చేయాలని వీరేంద్ర కోరారు.

కృష్ణావతారంలో జగన్నాథుడు



కృష్ణావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథ స్వామి



కశింకోటలో ప్రత్యేక అలంకరణలో జగన్నాథ స్వామి



కశింకోటలో స్వామి పూజలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి: జగన్నాథ స్వామి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం స్వామి కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గూడ్స్ రోడ్డులోని ఇంద్రద్యుమ్నహాల్‌లో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామి వారికి ఆలయ అర్చకుడు బంకుపల్లి సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో రాజసులోచన, ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, డైరెక్టర్లు బొండా రాజేష్, మోహన్‌రావు, వెంకట చలపతిరావు, వెంకటవీర అప్పారావు, కోటేశ్వరరావు, ధనలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

రామావతారంలో భక్తులకు దర్శనం

కశింకోట: కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన వేణుగోపాల స్వామి ఆలయంలో జగన్నాథ స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామిని విష్ణుమూర్తి దశావతారాల్లో ఏడోదిగా శ్రీరామావతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా జగన్నాథ, సుభద్ర, బలభద్ర ప్రతిమలను అందంగా పూలమాలలు, తులసీ మాలలతో అలంకరించి విష్ణు సహస్ర నామార్చన నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో అర్చన చేశారు. మంత్ర పుష్పం, మంగళ హారతి సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి శ్రీరామచరణాచార్యులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజగృహ విద్యానిలయం సేవలు అభినందనీయం



బహుమతులు అందజేస్తున్న అరబుపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక : విద్యాభివృద్ధికి రాజగృహ విద్యానిలయం అందిస్తున్న సేవలు అభినందనీయమని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కొనియాడారు. అరబుపాలెం రాజగృహ విద్యా నిలయంలో ఆధ్వర్యంలో డీఎస్ఆర్ అవార్డులను ఆయన ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు పలువురు విద్యార్థులకు పుస్తకాలు అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఇష్టపడి కష్టపడి చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. రాజగృహ విద్యానిలయం నిర్వాహకులు డి.అచ్చియ్యనాయుడు, కులదీప్, నేస్తం ఫౌండేషన్ నిర్వాహకులు గార సత్యనారాయణ, మాజీ సర్పంచ్ లంబా అప్పారావు, పీఎంసీ చైర్మన్ మహేష్, బాలగణేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక: మూలపేటలో గంగాలమ్మ తల్లి గుడికి దాతలు విరాళాలు అందజేస్తున్నారు. మునగపాకకు చెందిన సూరిశెట్టి కన్నారావు-లక్ష్మీ కాంతం దంపతులు రూ.20,116 నగదును ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు మాట్లాడుతూ గంగాలమ్మతల్లి గుడి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ప్రతి హామీ అమలు చేయాలి'

కె.కోటపాడు: రాష్ట్ర ప్రజలకు ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన కొండబాబు డిమాండ్ చేశారు. కె.కోటపాడులో ఆదివారం పార్టీ మండల కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా అమలు చేసి, అర్హులైన వారందరికీ లబ్ధి చేకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



కొత్తపెంట శివారులో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలు

దేవరాపల్లి: మండలంలోని కొత్తపెంట పంచాయతీ శివారు కొత్తూరులో సూరెడ్డి వారి కల్లాలు వద్ద విద్యుత్ స్తంభాలు, తీగలు ప్రమాదకరంగా మారాయి. పంట పొలాల మధ్యలో విద్యుత్ స్తంభాలు ఒక ప్రక్కకు ఒరిగిపోవడంతో పాటు, విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఇదే ప్రాంతంలో విద్యుత్ షాక్‌కు గురై పాడి గేదె మృతి చెందింది. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పనులు చేపడుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ప్రమాదకర విద్యుత్ స్తంభాలు, తీగల విషయమై విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానిక రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు, తీగల్ని సరిచేయాలని కోరుతున్నారు.

బస్ కాంప్లెక్స్ వద్ద పారిశుధ్య లోపం

- యథేచ్ఛగా చేపల విక్రయాలు, డ్రైనేజీల్లో వ్యర్థాలు
- మున్సిపల్ కౌన్సిల్ వద్దన్నా.. పట్టని అధికారులు
- దుర్గంధంతో ప్రయాణికుల అవస్థలు



ఆదివారం యలమంచిలి బస్ కాంప్లెక్స్ వద్ద చేపల విక్రయాలు



చేపలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

యలమంచిలి రూరల్ : పరిశుభ్రంగా ఉండే బస్ కాంప్లెక్స్ వద్ద చేపల అమ్మకాలు యథేచ్ఛగా జరిగిపోతున్నాయి. ఈ నెల 12న జరిగిన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి సహా వార్డు కౌన్సిలర్లు ఇక్కడ చేపల అమ్మకాలు జరపడానికి వీల్లేదంటూ తీర్మానించారు. సమావేశంలో ఈ విషయంపై చర్చ జరుగుతున్నపుడే మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావును పిలిచి చేపలు, మాంసం వంటివి విక్రయించడానికి ప్రత్యేకంగా చేపల మార్కెట్ ఉండగా బస్ కాంప్లెక్స్ వద్ద చేపల విక్రయాలేమిటని అడిగారు. వెంటనే అక్కడ చేపల విక్రయాలు నిలిపివేయించాలని రమాకుమారి ఆదేశించారు. అయినప్పటికీ అక్కడ ఎప్పటిలాగానే ఆదివారం కూడా చేపల విక్రయాలు దర్జాగా జరిగిపోయాయి. కొందరు మహిళలు ఇక్కడకు చేపలు తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నారు. వ్యర్థాలను పక్కనే ఉన్న డ్రైనేజీలో పడేస్తున్నారు. దీంతో అక్కడ దుర్గంధం వస్తోందని ఆటోవాలాలు, సమీప దుకాణదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. చైర్ పర్సన్,వార్డు కౌన్సిలర్లు వద్దని చెప్పినా శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేపల అమ్మకాలపై మాత్రం చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశమైంది. దిమిలి రోడ్డు కూడలికి సమీపంలో కూరగాయల మార్కెట్ వెనుక వైపు చేపలు, మాంసం విక్రయాలకు చోటు కల్పించారు. అయినప్పటికీ పట్టణంలో ఇతర ప్రాంతాల్లో చేపల విక్రయాలను అధికారులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. దీంతో పారిశుధ్యం లోపిస్తోంది. డ్రైనేజీల్లో వ్యర్థాలను వేయడం వల్ల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ విషయంపై ఇంఛార్జ్ మున్సిపల్ కమిషనర్ వద్ద ప్రస్తావించగా బస్ కాంప్లెక్స్ వద్ద చేపల అమ్మకాలను నిలిపివేయడానికి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.

వర్షాలతో తీరిన పశుగ్రాసం కొరత



వర్షాలకు పచ్చగా దర్శనమిస్తున్న పచ్చిక బయళ్లు

మాకవరపాలెం: వర్షాలతో పశుగ్రాసం కొరత తీరనుంది. గత మూడు నెలలుగా కాస్తున్న భారీ ఎండల కారణంగా పచ్చగా ఉండే బీడులు ఎండిపోయాయి. దీంతో పశువులు గ్రాసం లేక ఇబ్బందులు పడేవి. ఈ నేపథ్యంలో అధిక ధరకు రైతులు గ్రాసాన్ని కొలుగోలు చేసుకోవాల్సివచ్చేది. ఈ పరిస్థితుల్లో ఇటీవల కురుస్తున్న వర్షాలతో పచ్చికబయళ్లు పచ్చగా దర్శనమిస్తున్నాయి. దీంతో పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఇటు ఖరీఫ్ పంటలకు, మరో వైపు పశుగ్రాసం కొరత నివారణకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని రైతులు చెబుతున్నారు.

ఆశాజనకంగా ఆరుతడి పంటలు



ఏపుగా ఎదిగి, కాపుకొచ్చిన పెసర చేను

రోలుగుంట : మండలంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రైతులు ఆరుతడి పంటల సాగు చేపట్టారు. జానకిరాంపురం, కుసుర్లపూడి, రోలుగుంట, కొండపాలెం, శరబవరం, భోగాపురం, వడ్డిప తదితర గ్రామాల్లో మినుము, నువ్వు, పెసర, బొబ్బర తదితర ఆరుతడి పంటలు వేశారు. కొండపాలెం, భోగాపురం గ్రామాల్లో మినహా మిగిలి గ్రామాల్లో పంట ఏపుగా ఎదిగి, కాపుకొచ్చింది. ఈ పంటల దిగుబడిపై రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆరుతడి పంటలకు దుక్కులు చేసి, విత్తనాలు చల్లుకుంటే చాలని, కూలీతో పని లేకుండా కుటుంబ సభ్యులకు పని సరిపోతుందని చెప్పన్నారు. ఈ ఏడాది దిగుబడులు మెరుగ్గానే ఉంటాయని, పెట్టుబడులు పోను ఆదాయం బాగానే ఉంటుందని రైతులు చెబుతున్నారు.